క్లుప్తంగా

ఆలయానికి రూ. 25 వేల విరాళం



చెక్కు అందజేస్తున్న పేరాడ తిలక్

టెక్కలి: స్థానిక ఆదిఆంధ్రావీధిలో నూతనంగా నిర్మించిన పాతపట్నం నీలమణి దుర్గమ్మ వారి ఆలయానికి రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ రూ.25 వేలు విరాళం ప్రకటించారు. బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలకు హాజరైన తిలక్ తనవంతుగా విరాళాన్ని ప్రకటించి సంబంధిత చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు, స్థానిక నాయకులు కె.అజయ్, బి.తులసీరావు, పి.వైకుంఠరావు, ఎ.మాధవరావు, ఆలయ కమిటీ సభ్యులు డి.మదీన్, డి.భీష్మారావు ఉన్నారు.

ఈక్రాప్ ముసాయిదా జాబితా విడుదల



తేలుకుంచిలో జాబితా చదివి వినిపిస్తున్న ఏఈవో ప్రవీణ్

ఇచ్ఛాపురం రూరల్: రబీలో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి విడుదలైన ముసాయిదా జాబితాలో రైతుల పేర్లు, వివరాలు తప్పుగా నమోదైతే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి అన్నారు. బుధవారం తేలుకుంచి, హరిపురం, మండపల్లి, బిర్లంగి రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులతో సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల సాగు విస్తీర్ణం, ఖాతా, సర్వే నంబర్లు, పంట రకాలు వంటి వివరాలను వ్యవసాయ సహాయకులు చదివి వినిపించారు.

యువజన సంఘం నూతన కార్యవర్గం



వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘ సభ్యులు

కవిటి: సామాజిక సేవా కార్యక్రమాల్లో పునరంకితమవుదామని ఉషోదయ యువజన సంఘ గౌరవాధ్యక్షుడు బెందాళం చిట్టిబాబు అన్నారు. ఈ మేరకు సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా కవిటి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ పాండవ చంద్రశేఖర్, కార్యదర్శిగా పులకల వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా బెందాళం హరి, శాశ్వత కోశాధికారిగా మొర్రి ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులుగా జన్ని లోకనాథం, దశరధరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ప్రమాణ స్వీకారం చేశారు.


తలసేమియా బాధితురాలికి రక్తదానం



రక్తదాత ప్రసాదరావు

కాశీబుగ్గ: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పట్టణానికి చెందిన ఎస్.భావన అనే చిన్నారికి అత్యవసరంగా ఏ–పాజిటివ్ రక్తం అవసరమైంది. కాశీబుగ్గలోని ఓ ఆస్పత్రిలో చిన్నారి ఉన్నట్టు తెలుసుకున్న పలాస మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన మామిడి ప్రసాద్ ముందుకొచ్చి భావనకు బుధవారం రక్తదానం చేసి ప్రాణభిక్ష పెట్టారు. ఈయన ఇప్పటి వరకు అత్యవసర పరిస్థితిలో ఉన్నటువంటివారికి 16 సార్లు రక్తదానం చేశారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సౌజన్య

సోంపేట: విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని కొర్లాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి బి.సౌజన్య అన్నారు. జింకిభద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై బుధవారం అవగాహన కల్పించారు. ఆరోగ్యంపైనే ఉజ్వల భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు బి.వేణుగోపాలరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో మండపల్లి

- ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ కార్యాలయాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతు భరోసా కేంద్రం



పాలవెల్లువ కేంద్రం

ఇచ్ఛాపురం రూరల్: పల్లెల్లో అభివృద్ధి పరుగు పెడుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే ఈ పరిస్థితికి కారణం. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. దీనికి మండపల్లి గ్రామాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు సమకూరి.. ఇచ్ఛాపురం నియోజకవర్గానికే ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో చదువు కోవడానికి కనీసం సౌకర్యవంతంగా లేని పాఠశాల భవనాలతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. అలాగే రోజుల తరబడి మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరిగితే గానీ బస్తా విత్తనాలు, ఎరువులు లభ్యంకాక రైతులు అవస్థలు ఎదుర్కొనేవారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే సుదూరంలో ఉన్న ఇచ్ఛాపురం వెళ్తేగాని వైద్యం అందేది కాదు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో మండపల్లి గ్రామం ముంగిట్లోకి ప్రభుత్వ కార్యాలయాలు వచ్చి చేరాయి.

సుందరంగా పాఠశాల భవనాలు..

నిన్నటి వరకు పాడుబడిన భవనంలో ప్రాథమిక విద్య సాగించిన విద్యార్థుల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా భవనాలను నిర్మించింది. ఉన్నత పాఠశాలగా మార్పు చేసి రూ. 2.19 కోట్లతో పాఠశాల భవనాలకు రంగులతో పాటు ఫర్నిచర్, విద్యుత్, మంచినీరు, డైనింగ్ హాల్, విద్యుత్, కిచిన్ షెడ్లు వంటి మౌలిక సదపాయాలు కల్పించింది. ఈ పాఠశాలలో ఇప్పుడు ఆరు వందల మందికి పైగా పిల్లలు చదువుతున్నారు.



వైఎస్సార్ హెల్త్ క్లినిక్

విలేజ్ హెల్త్ క్లినిక్

వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండపల్లి ప్రజలు అనారోగ్యం పాలు కాకూడదన్న లక్ష్యంతో రూ.17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మించారు. అలాగే రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణం చేపట్టారు. రూ.15.74 లక్షలతో జగనన్న పాలవెల్లువ భవనాన్ని కట్టించారు. ఈ భవనాలన్నీ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. గ్రామ స్థాయిలోనే మౌలిక సదుపాయాలు సమకూరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగనన్నతోనే గ్రామాభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే గ్రామాభివృద్ధి సాధ్యం. దీనికి మండపల్లి పంచాయతీనే ఉదాహరణగా చెప్పవచ్చు. గతంలో ఒక్క ప్రభుత్వ కార్యాలయం లేనటువంటి మా గ్రామంలో ఇప్పుడు కోట్ల రూపాయలు వెచ్చించి పక్కా భవనాలు నిర్మించారు. ఇప్పుడు స్థానికంగానే అందరి అవసరాలు తీరుతున్నాయి. ముందుముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో మండపల్లిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతాం.

– పిట్ట శేషమ్మ, సర్పంచ్, మండపల్లి

ప్రజాసేవతోనే గుర్తింపు



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న తిలక్

కోటబొమ్మాళి: పేదలకు సహాయం చేయడం, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడంతోనే గుర్తింపు లభిస్తుందని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. కోటబొమ్మాళికి చెందిన సదాశివుని గంగారావు తన తండ్రి పేరున ఏర్పాటు చేసిన సదాశివా సేవా ఫౌండేషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మంది పేదలకు తిలక్ చేతులమీదుగా చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ద్వారా రానున్న కాలంలో పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్టు నిర్వాహకుడు గంగారావు తెలిపారు. ఈ సందర్భంగా మూడు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు అన్నెపు రామారావు, నంబాళ్ల రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దుక్క రామక్రిష్ణ, పేడాడ వెంకటరావు, ఎస్.వినోద్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



కర్రిబాబు పాడిమోస్తున్న సాయిరాజ్

కవిటి: జగతి పంచాయతీ మాజీ సర్పంచ్ కర్రి బాబు బుధవారం మృతి చెందారు. ఈయన మృతిపై ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ తదితరులు సంతాపం తెలియజేశారు. కర్రిబాబు మృతి సమాచారం తెలుసుకున్న సాయిరాజ్ గ్రామానికి చేరుకొని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కర్రిబాబు పాడిమోయడంతోపాటు దహన సంస్కారాలను పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, బెజ్జిపుట్టుగ సర్పంచ్ ఎస్.పి.నారాయణస్వామి, జిల్లా క్రికెట్ సంఘం జాయింట్‌సెక్రటరీ టీవీ రమణ పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు



వెంకటచలంకు జ్ఞాపిక అందజేస్తున్న జిల్లా అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తున్న కొండవూరు జిల్లా ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎల్.వెంకటచలం సేవలను అధికారులు ప్రశంసించారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వెంకటచలం చేసిన సేవలను గుర్తించి జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి బి.రమణమూర్తి, జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షులు బగాది రామ్మోహన్‌రావు చేతుల మీదగా జ్ఞాపికను అందించి అభినందించారు. వెంకట చలం రెండు దశాబ్దాలుగా వినియోగదారులను చైతన్య పరుస్తూ విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆయన ప్రస్తుతం రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చెర్మన్‌గా సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు.

ఉపాధి పథకాన్ని బలోపేతం చేయాలి



ఉపాధి పనుల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

పలాస: ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని అఖిలభారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత కిసాన్ మహాసభ, ఆలిండియా ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డపాడు గ్రామంలో ఉపాధి వేతనదారులతో కలిసి గ్రామ సచివాలయం వద్ద సంబంధిత అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉపాధి పనులు జరుగుతున్న ఏపాడు చెరువు వద్దకు వెళ్లి వేతనదారులతో మాట్లాడారు. ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు వేతనం కనీసం రూ.600 ఉండేలా చూడాలని కోరారు. డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, దున్న శ్రీనివాసరావు, పోతనపల్లి కామేశ్వరరావు, అప్పారావు, దుష్యంతు, జగదీష్, రామక్రిష్ణ, యుగంధర్, కైలాస్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలి



గిరిబాబు, దివ్యలను సత్కరిస్తున్న యూవీవీ ప్రతినిధులు

పలాస: ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే లక్ష్యాలను ఎంచుకొని వాటిని చేరుకోవడానికి తగిన కృషి చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ నెఫ్రాలజీ ఎండీ డాక్టర్ గిరిబాబు అన్నారు. నీలావతిలోని ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఏర్పాటు చేసిన ప్రజాగ్రంథాలయాన్ని బుధవారం సందర్శించారు. అతనితో పాటు ఎం.ఎస్ ఆప్తామాలజిస్ట్ జుత్తు దివ్య కూడా ఉన్నారు. వీరిద్దరిని ఈ సందర్భంగా వేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయం అభివృద్ధికి తమవంతుగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్మాణ కమిటీ కనీ్వనరు కుత్తుం ప్రకాశరావు, యూవీవీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జోగారావు, బొడ్డు చిన్నారావు, జినగ సీతారామ్, కామేష్, కుత్తుం సుధాకర్, మడియా వాసు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.2.80 లక్షల పన్ను చెల్లింపు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నుల వసూలు జోరుగా సాగుతోంది. బుధవారం ఇచ్ఛాపురం వీకేపేట రోడ్డులోని ఎస్‌బీఐ కార్యాలయానికి సంబంధించి యజమాని ప్రకాష్ రూ.2,80,000 పన్నును మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ జి.అమరేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల ఔదార్యం

- రూ. 4 లక్షల ఆర్థికసాయం



అరుణ్‌కు సాయం అందజేస్తున్న దృశ్యం

కంచిలి: ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అరుణ్ కుమారుడు జశ్వంత్‌కు ఇటీవల వెన్నెముకకు శస్త్ర చికిత్స జరిగింది. ఈ అబ్బాయి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలుసుకుని చలించిపోయిన మండలంలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులంతా స్పందించారు. స్థానిక ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో రూ. 4 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని అరుణ్‌కు స్థానిక ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, మిగతా ఉద్యోగులంతా కలిసి బుధవారం అందజేశారు. ఈ మంచి కార్యక్రమానికి సహకరించిన సహోద్యోగులందరికీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ



హేమసుందర్‌కు ట్రైసైకిల్ అందజేసిన దృశ్యం

కవిటి: కళింగపట్నం గ్రామానికి చెందిన 12 ఏళ్ల దివ్యాంగు బాలుడు ఇద్ది హేమసుందర్‌కు బొరివంకు చెందిన రిటైర్డు బీఎస్‌ఎఫ్ ఏఎస్సై బల్లెడ విజయ ప్రసాద్ తన కుమారుడు దివంగత కశ్యప్ ప్రియతమ్ జ్ఞాపకార్థం రూ. 22 వేల విలువైన ట్రైసైకిల్‌ను వితరణగా అందించారు. అలాగే హెల్పింగ్‌హ్యాండ్స్‌సంస్థ సభ్యులు రెండు నెలలకు సరిపడే రేషన్ సరుకుల్ని సమకూర్చారు. కార్యక్రమంలో కుసుంపురం ఉప సర్పంచ్ లండ ధర్మరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి బాలయ్య ఉన్నారు.

విద్యార్థులు మెలకువలు పాటించాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న డీసీవో గ్రేస్

కంచిలి: పరీక్ష రాసే విధానంలో విద్యార్థులు మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని డీసీవో గ్రేస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలను బుధవారం సాయంత్రం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆ సందర్భంగా విద్యార్థులతో సమావేశమయ్యారు. లేఖనా కౌశలా నైపుణ్యాలను వివరించారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. అలాగే గురుకుల రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఎం.రమణ ఉన్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

మందస: తన కుమార్తె నాలుగు రోజులుగా కనిపించడం లేదని లొహరిబంద గ్రామానికి యువతి తల్లి ఫిర్యాదు చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వై.రవికుమార్ చెప్పారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 19వ వార్డు సూదికొండ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను బుధవారం పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి గోపి, ప్రధానోపాధ్యాయులు టి మధు, ఏఎన్‌ఎం శ్రావణి పాల్గొన్నారు.

ఆర్‌బీకేల సందర్శన

సోంపేట: రైతులు రబీ సీజన్లో సాగు చేస్తున్న పంటల వివరాలను విధిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి సూచించారు. మామిడిపల్లి, జింకిభద్ర ఆర్‌బీకేలను బుధవారం పరిశీలించారు. రబీ సీజన్లో పంట నమోదు చేసుకున్న రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ముసాయిదా జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్నామన్నారు.

నేడు షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

కంచిలి: మకరాంపురం గ్రామంలోని షిర్డీసాయి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త బి.రమణసాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోజంతా వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగానే ఆలయ ప్రాంగణంలో ఉన్న దత్తాత్రేయ మందిరం తృతీయ వార్షికోత్సవాన్ని కూడా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు ప్రశాంతం
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అధికారులు



టెక్కలి: విశ్వజ్యోతి కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



ఇచ్ఛాపురం: సమయం సమీపిస్తుండడంతో పరీక్ష కేంద్రానికి పరుగు తీస్తున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: పరీక్ష కేంద్రం వద్ద హాల్ టిక్కెట్ నంబర్ ఆధారంగా గదుల వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు



వజ్రపుకొత్తూరు: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

టెక్కలి: ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో బుధవారం ఆరంభమయ్యాయి. తొలి రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్ష రాశారు. వివిధ కేంద్రాలను ఉన్నతాధికారులు సందర్శించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఎస్ అండ్ జేఆర్, విశ్వజ్యోతి, ఎస్‌వీఆర్‌కే, మదర్ థెరిసా కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో మొత్తం 1071 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 1033 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, తహసీల్దారు కిశోర్ తదితరులు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

- ఇచ్ఛాపురం రూరల్: బి.తోటూరులోని ఆదిత్యా విద్యా సంస్థ కేంద్రంలో పరీక్షలు ప్రశాంతాంగా జరిగాయి. తొలి రోజు ద్వితీయ భాష తెలుగు, సాంస్కృతం, ఒడియా మాధ్యంలో జరిగిన పరీక్షల్లో 251 మంది విద్యార్థులకు 236 మంది పరీక్ష రాశారు. 15 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటిండెంట్ బబులా సాహూ తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారిగా పి.అరుణ్‌కుమార్ వ్యవహరించారు. పోలీసులు 114 సెక్షన్ అమలు చేశారు.
- కవిటి: కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఎస్‌వీజే ప్రైవేట్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో 203 మందికి 18 మంది, ఎస్‌వీజే కళాశాలలో 222 మందికి ఐదుగురు గైర్హాజరైనట్టు ఆయా కేంద్రాల డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు బి.సురేష్‌కుమార్, పి.సుధాకర్ తెలిపారు. ఎస్సై కె.రాము బందోబస్తు పర్యవేక్షించారు.
- కంచిలి: కంచిలిలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 189 మందికి 184 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇక్కడ చీఫ్ సూపరింటిండెంట్‌గా కె.సి.హెచ్.పట్నాయక్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా ఎన్. బాపూజీ వ్యవహరించారు. అలాగే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం కేంద్రంలో 213 మంది 205 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ ఎం.రమణ తెలిపారు.
- ఇచ్ఛాపురం: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలు మొదలయ్యాయి. ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో 326 మంది పరీక్ష రాయాల్సి ఉండగా పది మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో 218 మందికి ఏడుగురు, స్వర్ణభారతి జూనియర్ కళాశాల కేంద్రంలో 326 మందికి 12 మంది, ఆదిత్య జూనియర్ కళాశాల కేంద్రంలో 230 మందికి 15 మది గైర్హాజరయ్యారు. ఈ కేంద్రాలకు డీవో, సీఎస్‌లుగా బి.శంకర్ ప్రసాద్, పి.రజనీకుమారి, బబులాసాహు వ్యవహరించారు.
- సోంపేట: బారువ, సోంపేటల్లోని ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 1177 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 40 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.
- సంతబొమ్మాళి: నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 193 విద్యార్థులకుగాను 189 మంది హాజరయ్యారు. జిల్లా వృత్తివిద్యా అధికారి ప్రకాశరావు పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.
- వజ్రపుకొత్తూరు: పూండి గోవిందపురంలోని పరీక్ష కేంద్రాన్ని డీవీఈవో కోట ప్రకాశరావు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కాగా వజ్రపుకొత్తూరు బాలికలు జూనియర్ కళాశాల, గోవిందపురం జూనియర్ కళాశాల, సాయి వినిత్ కళాశాలలకు చెందిన 228 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 10 మంది గైరాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్ టి.శ్రీనివాసరావు తెలిపారు.
- కోటబొమ్మాళి: మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 183 మందికి 178 మంది పరీక్షకు హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. అలాగే వంశధార జూనియర్ కళాశాలలో 182 మందికి ముగ్గురు గైర్హాజరవ్వగా 179 మంది పరీక్ష రాశారు. ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలి కేంద్రాల వద్ద బందోబస్తు పర్యవేక్షించారు.
- కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో ఏడు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 1605 మంది హాజరు కావాల్సి ఉండగా 1561 పరీక్ష రాశారు. 44 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 234 మందికి 225 మంది పరీక్ష రాయగా.. తొమ్మిది మంది హాజరు కాలేదని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు.

తక్షణ సాయం అందజేత

సంతబొమ్మాళి: ఆర్‌హెచ్ పురం గ్రామానికి చెందిన చిగురువలస ఈశ్వరమ్మ ఇటీవల మరణించారు. ఈమెకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమె కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. సర్పంచ్ ఎన్ని మన్మథరావు, ఈఓపీఆర్‌డీ హనుమంతు శశిభూషణరావు, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

కంచిలి: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు ద్విచక్ర వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్సై ఎస్.చిరంజీవి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టీవీఎస్ అపాచీ, హీరో హోండా స్ప్లెండర్, బజాజ్ పల్సర్, హోండా సీబీ షైన్, హీరో హోండా సీడీ 100, టీవీఎస్ స్టార్ బైక్స్ ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఈ వేలంలో ముందుగా రూ. వెయ్యి డిపాజిట్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలకు గ్రైండర్ వితరణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రీన్‌ఆర్మీ అసోసియేషన్ సభ్యులు గ్రైండర్‌ను వితరణ చేశారు. ఈ పాఠశాలలో సుమారు వెయ్య మంది చదువుతున్నారు. మధ్యాహ్న భోజన వంటల సమయంలో మసాలాలు, పచ్చళ్లు తయారు చేయడానికి సిబ్బంది ఇబ్బంది పడుతున్నట్టు తెలుసుకున్న సభ్యులు రూ. ఐదు వేల విలువైన గ్రైండర్‌ను కొనుగోలు చేసి ప్రధానోపాధ్యాయిని నగిరి లక్ష్మికి బుధవారం అందజేశారు. గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, జాతీయఅవార్డు గ్రహీత ఆసపాన మధుబాబు, సైన్సు ఉపాధ్యాయుడు బోకర దుర్యోధనరావు పాల్గొన్నారు.